క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో 33/11 కేవీ హనుమంతవాక సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ నిర్వహణ పనులు జరగనుండడంతో సరఫరాకు అంతరాయం కలగనుంది. దీన్‌దయాళ్‌పురం, వాణిజ్య పన్నుల శాఖ రీజనల్ కార్యాలయం, చినగదిలి, సంతపాలెం, సాలిపేట, సిద్ధార్థ బీసీ కాలనీ, పెదగదిలి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

'కొండవాలులో సమస్యల తిష్ట'

ఆరిలోవ: స్థానిక కొండవాలులో సమస్యలు తిష్ట వేశాయని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి ప్రాంతం కొండవాలులో గురువారం ఇదేమి ఖర్మరా బాబూ కార్యక్రమం స్థానిక నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సింహాచలం దేవస్థానం అధికారుల వైఖరి వల్ల కొండవాలులో కనీస సౌకర్యాలు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఒమ్మి అప్పలరాజు, సత్యం, గోవింద్, రాజారావు, పోలరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ

ఎంవీపీ కాలనీ: ప్రకృతి పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యమని మడగాస్కర్‌కు చెందిన ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్కు విద్యార్థిని కసాంద్రా అన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీలోని సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీలో పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన కార్యక్రమంలో కసాంద్ర మాట్లాడారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, అకాడమీ డైరెక్టర్ స్వప్న, అధ్యాపకులు విజయలక్ష్మి, అమృత, మురళి, కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం చిత్తడి నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ చిత్తడి నేలలతో పర్యావరణానికి ఉన్న సత్సంబంధాలను వివరించారు. డాక్టర్ రామారావు మాట్లాడుతూ పర్యావరణంపై పరిశోధనలు, చిత్తడి నేలల స్థితిగతులపై చర్చించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీవాణి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి బుద్దా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రెంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రెంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు వారి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో మత్స్యకారులకు భరోసా

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- జాలరిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమం పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మత్స్యకార కుటుంబాలకు భరోసా లభించిందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సురాడ వెంకటలక్ష్మితో కలిసి అక్కరమాని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలు తెలుసు కుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ మత్స్యకార మహిళల ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

మత్స్యకారుల కష్టాలను తీర్చి వారిని అభివృద్ధి ముంగిట నిలిపేందుకు ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో వారికి పెద్ద పీట వేయడంతో పాటు వేట విరామం సమయంలో మత్స్యకార భరోసా అందజేస్తూ ఆదుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి పోలీసుల అంత్యక్రియలు



అంతక్రియల్లో పాల్గొన్న హెచ్‌సీ గంగాధర్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఓ అనాథ శవానికి ఎంవీపీ పోలీసులు గురువారం అంత్యక్రియలు నిర్వహించి, తమ ఔదార్యం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీలో ఇటీవల ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. 75 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి చనిపోయి ఉండడాన్ని స్థానికులు గమనించి ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కొన్నిరోజులుగా ఆ మృతదేహం కోసం ఎవరూ రాలేదు. దీంతో గురువారం హెచ్‌సీ గంగాధర్, పీసీ రవినాయక్‌లు ఓ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలపై పలువురు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏపీపీటీడీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎంయూటీ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఏపీపీటీడీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును విజయవాడలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. గత మూడు రోజుల పాటు రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులలో గుర్తించిన సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందించారన్నారు.

బాధ్యతగా నగర సుందరీకరణ

- బీచ్ కారిడార్ పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



జోడుగుళ్లపాలెం బీచ్‌ను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగర సుందరీకరణకు రాజీ లేకుండా బాధ్యతతో పని చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. జోన్-2 పరిధి 9వ వార్డు తెన్నేటిపార్కు నుంచి జూ పార్క్ వరకు ఉన్న బీచ్ కారిడార్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చిలో జీ-20 సదస్సు జరగనున్న దృష్ట్యా విదేశీ ప్రతినిధులు అధిక సంఖ్యలో నగరానికి వస్తారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం మన బాధ్యత అన్నారు. సముద్ర తీర ప్రాంతం వెంబడి నూతన హంగులతో బీచ్ కారిడార్‌ను తీర్చిదిద్దాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లకు ఆకర్షణీయమైన రంగులు వేయించాలని, బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ అలంకరణ పనులతో పాటు బీచ్‌లో ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. చెట్లను ట్రిమ్మింగ్ చేసి మంచి ఆకృతి కలిగే విధంగా తీర్చిదిద్దాలని చెప్పారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిషోర్, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీధర్, హార్టికల్చర్ మానిటరింగ్ ఆఫీసర్ చక్రవర్తి, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మోజీ, సహాయక ఇంజినీర్ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సౌందర్యలహరి ప్రవచనాలు

ఎంవీపీ కాలనీ: శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్కులో శనివారం నుంచి జరగనున్నాయి. సామవేదం షణ్ముఖశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రవచనాలు నిర్వచించనున్నారు. ఈ నెల 12వ తేదీ వరకు రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచనాలు జరగనున్నాయి. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్టు శ్రీమాత భక్త బృందం సభ్యులు తెలిపారు.

బాలుర గృహం సందర్శన



బాలుర గృహంలో అన్నం, సాంబారును పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు

ఆరిలోవ: స్థానిక దీన్‌దయాళ్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహాన్ని గురువారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సందర్శించారు. బాలుర సంఖ్య, విద్యా, వసతి, భోజన సౌకర్యాల గురించి గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్యను అడిగి తెలుసుకున్నారు. వంట గది, భోజనాల గదిని పరిశీలించారు. వండిన అన్నం, కూరలు, సాంబారును రుచి చూశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బాలురలో స్నేహ పూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. తరచూ బాలురకు వైద్య పరీక్షలు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. క్రమశిక్షణతో చదువు కోవాలని బాలురకు ఆయన సూచించారు.

990 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



పీడీఎఫ్ బియ్యం తరలిస్తున్న వ్యాన్

ఎంవీపీ కాలనీ: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని రాత్రి గస్తీ పోలీసులు పట్టుకున్నారు. ఆ వ్యాన్‌తో పాటు తరలిస్తున్న 990 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి గస్తీ సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ వ్యాన్‌ను ఇసుకతోట కూడలి వద్ద పోలీసులు గుర్తించారు. వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం బస్తాలు బయటపడ్డాయి. వ్యాన్ డ్రైవర్‌ను వివరణ కోరగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకొని ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. గురువారం ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, వ్యాన్ సీజ్ చేయడంతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. పట్టుబడిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.

మాతృ మరణాల నివారణకు చర్యలు

మహారాణిపేట: మాతృ మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. గురువారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటీవల ఒక మాతృ మరణం సంభవించిందని, ఇక ముందు అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు చోటు చేసుకోకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ వై.వి.నరసింహారావు, వైద్యులు డాక్టర్ ఉమావతి, బి.జ్యోతి, ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఏఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమీషన్ ఆశ చూపిస్తూ కమీషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమీషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమీషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూలో బయోస్కోప్ ఆధునికీకరణ



జూలో బయోస్కోప్‌పై నిర్మిస్తున్న అదనపు శ్లాబు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో బయోస్కోప్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ సందర్శకులకు షార్ట్‌ఫిల్మ్ ద్వారా వన్యప్రాణుల గురించి అవగాహన కల్పిస్తుంటారు. జూకు సంబంధించి ఏవైనా సమావేశాలు, సిబ్బందికి ఇక్కడే శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. దీని లోపల కొంత భాగంలో గిరిజన ఉత్పత్తులు, వన్య ప్రాణుల స్పెసిమెన్‌లతో మ్యూజియం కూడా ఏర్పాటు చేశారు. ఇవన్నీ సుమారు 300 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీని అభివృద్ధి కోసం ఐవోసీఎల్(ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్) సీఎస్ఆర్ నిధులు కేటాయించింది. గతేడాది జూ అధికారులతో ఎంవోయూ కుదుర్చుకుని సుమారు రూ.2 కోట్లు అందజేసింది. ఆ నిధుల్లో రూ.40 లక్షలతో బయోస్కోప్ ఆధునికీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత బయోస్కోప్ శ్లాబ్‌పై అదనంగా మరో శ్లాబు వేస్తున్నారు. దీనిలో సమావేశాలు, పిల్లలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న కింద హాల్‌లో వన్యప్రాణుల జీవిత విశేషాలతో చార్టులు, ఫొటోలు ఏర్పాటు చేయనున్నారు.

రైతుబజార్‌లో అధిక ధరలకు విక్రయాలు!



రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌లో రైతులు కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినా రైతుల తీరు మారడం లేదు. గురువారం రైతుబజార్‌కు వెళ్లిన వినియోగదారులకు కాలీఫ్లవర్ పువ్వు ఒక్కటి రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయించారు. వాస్తవానికి కాలీఫ్లవర్ కేజీ ధర రూ.14 మాత్రమే ఉంది. కేజీ నుంచి 1100 గ్రాముల వరకు బరువున్న కాలీఫ్లవర్ పువ్వును రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయించడాన్ని కొంతమంది వినియోగదారులు ఎస్టేట్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లారు. వాస్తవానికి బోర్డ్ రేటు ప్రకారం కాలీఫ్లవర్ పువ్వు రూ.14 నుంచి రూ.16 వరకు మాత్రమే ఉంటుంది. దీనికి భిన్నంగా ఐదు నుంచి పది రూపాయలు అధికంగా విక్రయించడం పరిపాటిగా మారిపోయింది. అధిక ధరలకు అమ్మిన రైతులను పిలిచి అలా అమ్మవద్దని చెప్పి పంపేశారు. సదరు రైతులు తమ స్టాల్ వద్దకు వెళ్లి యథాతథంగా అధిక ధరలకు విక్రయించడం గమనార్హం. దీంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధరల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు క్రమ శిక్షణ అవసరం



మాట్లాడుతున్న ఎన్జీవో వీడీఎం ఇండియా వ్యవస్థాపకుడు అజిత్‌కుమార్

ఆరిలోవ: ప్రతి విద్యార్థి అభివృద్ధికి మంచి లక్షణాలు, క్రమ శిక్షణ అవసరమని ఎన్జీవో వీడీఎం ఇండియా ఆన్ ది మూవ్ వ్యవస్థాపకుడు ఆచార్య అజిత్‌కుమార్ తెలిపారు. శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో మంది పేదరికంలో ఉన్నవారు కూడా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పేదరికం నుంచే ఉన్నత స్థాయికి చేరారని చెప్పారు. ప్రతి విద్యార్థి మానసికంగా శారీరకంగా దృఢత్వం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రశాంతత అవసరమని సూచించారు. భవిష్యత్తులో విద్యావకాశాలు, నైపుణ్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ టి.ఎం.ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన జపాన్ ప్రొఫెసర్



ఆచార్య సుమికోను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగాన్ని జపాన్‌లోని వసీడ యూనివర్సిటీ జియోమార్ఫాలజీ విభాగ ప్రొఫెసర్ కుమో సుమికో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగ విద్యార్థులను ఉద్దేశించి జియో స్పేషియల్ టెక్నాలజీ అంశంపై ఆమె మాట్లాడారు. ఫీల్డ్‌వర్క్ ప్రాధాన్యత, పరిశీలన తదితర అంశాలను వివరించారు. గతంలో విభాగ విశ్రాంత ఆచార్యుడు కాకాని నాగేశ్వరరావు పర్యవేక్షణలో పని చేసిన అనుభవాలను ఆమె గుర్తు చేసుకున్నారు. 2010-11 సంవత్సరాలలో కేజీ బేసిన్ ప్రాంతంలో జియో మార్ఫలాజిక్ అధ్యయనాలు జరిపిన విధానం తెలియజేశారు. విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్ ఏయూతో సంయుక్తంగా పని చేయాలని వసీడ విశ్వవిద్యాలయాన్ని ఆహ్వానించారు. ఈ దిశగా కృషి చేయాలని సుమికోకు సూచించారు. మోడ్రన్ జియో స్పేషియల్ టెక్నాలజీపై కలసి పని చేయాలని ఆహ్వానించారు. అనంతరం సుమికోను సన్మానించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

మహారాణిపేట: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషుల నిష్పత్తి సమానంగా లేదని, దీనిపై అందరికీ అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వల్ల కేరళ రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉందని చెప్పారు. లింగ నిర్ధారణ ఏదైనా ఆస్పత్రిలో అవుతుందన్న సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సమత, సత్యవతి, అధికారులు కె.ధర్మేంద్ర, వై.స్వర్ణలత, లక్ష్మి, మణికుమారి, బి.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య




ఆత్మహత్యకు పాల్పడిన శైలజ



భర్త విజయకుమార్‌తో శైలజ (ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకొన్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయకుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్-విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్ - కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ - కోయంబత్తూర్ (03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం



పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ ఫర్ డెసీలీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.'అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

మహిళకు బ్యాగ్ అప్పగింత



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న క్రైం డీసీపీ నాగన్న

అల్లిపురం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికి పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ.. పోతినమల్లయ్యపాలేనికి చెందిన ఎం.కస్తూరిబాయి బుధవారం తమ ఇంటికి వెళ్లేందుకు జడ్జి కోర్టు వద్ద ఆటో ఎక్కారు. ఆమె వద్ద డ్రై వాష్ చీరలతో బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్ ఉంది. గొల్లలపాలెం సర్కిల్ వద్ద డ్రై వాష్ చీరల బ్యాగ్ తీసుకుని దిగిపోయారు. హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయారు. అందులో రూ.లక్ష నగదు ఉంది. కొంతసేపటి వరకు ఆమెకు తన బ్యాగ్ గుర్తుకురాలేదు. తర్వాత తేరుకుని ఆటోలో మరిచిపోయానని గ్రహించారు. ఆటోను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ క్రైం జి.నాగన్న ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐలు కె.శ్రీను, డీవీ అప్పారావు తమ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి ఆటోను పట్టుకున్నారు. డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం బాధితురాలికి నగదుతో సహా బ్యాగ్‌ను అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.